శ్రీసౌమ్యనాథ సేవా ట్రస్ట్ నిధులు రూ.1.81 కోట్లు

సమావేశమైన ట్రస్ట్ సభ్యులు

నందలూరు: జిల్లాలో చారిత్రాత్మక, సుప్రసిద్ధ దేవాలయమైన నందలూరులోని శ్రీ సౌమ్యనాథ స్వామి ఆలయం ఎదురుగా ఉన్న శ్రీ సౌమ్యనాథ అన్నదాన సేవా ట్రస్ట్ నిధులు1,81,44,406 రూపాయలు ఉన్నట్లు సేవా ట్రస్ట్ అధ్యక్షులు ఎద్దల సుబ్బరాయుడు తెలిపారు. సోమవారం ట్రస్ట్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సౌమ్యనాథ అన్నదాన భవనం ముందు భక్తుల సౌకర్యార్థం రేకుల షెల్టర్‌ను ఏర్పాటు చేయడానికి తీర్మానించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సెక్రటరీ శైలేంద్రనాథ్, కోశాధికారి చక్రాల రామసుబ్బన్న, ట్రస్ట్ సభ్యులు పల్లె సుబ్రహ్మణ్యం, గంటా వాసుదేవయ్య, జంగం శెట్టి వెంకటసుబ్బయ్య, షేక్ సర్దార్, లంకయ్య గారి సుబ్బరామయ్య, మోడపోతుల రాము పాల్గొన్నారు.

పారిశ్రామిక రంగం పరుగులు

ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి

కడపలో ఆల్ డిక్సన్, రాజీవ్ పార్కు, మార్గ్ శిలాఫలకాల ఆవిష్కరణ

కొప్పర్తి ఇండస్ట్రియల్ పార్క్‌లో ఆల్‌డిక్సన్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న సిఎం జగన్‌మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లాలోని కొప్పర్తి మెగా ఇండస్ట్రియల్ పార్క్ కేంద్రంగా పారిశ్రామికరంగం పరుగులు పెడుతుందని ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. జిల్లాలో మూడవ రోజు పర్యటనలో భాగంగా రూ.871 కోట్ల వ్యయంతో కూడిన పలు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలతో బిజీబిజీ గడిపారు. కొప్పర్తి మెగా ఇండస్ట్రియల్ పార్క్‌లో ఆల్ డిక్సన్ యూనిట్‌ను ప్రారంభించారు. టెక్నోడోమ్, వర్ల్‌పూల్ మేజ్ సంస్థలకు, శంఖు స్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2007 నుంచి వర్ల్‌పూల్ మ్యాప్ ఆధారిత సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్‌ను అభివృద్ధి చేస్తున్న "వర్ల్‌పూల్ మేజ్ సాఫ్ట్‌స్ ప్రైవేట్ లిమిటెడ్" వైఎస్‌ఆర్ జిల్లాకే తలమానికంగా అభివృద్ధి చెందుతున్న కొప్పర్తిలో వైఎస్‌ఆర్‌ఈఎంసిలో తమ ఉత్పత్తులను ప్రారంభించేందుకు ముందుకు వచ్చిందని తెలిపారు. ఎలక్ట్రిక్ వాహనాలకు వాడే బ్యాటరీలు, జిపిఎస్ ట్రాకర్, స్మార్ట్ పిం బి వంటి అధునాతన డివైస్ పరికరాలను ఉత్పత్తి చేసే యూనిట్ స్థాపన రూ.71.10 కోట్ల పెట్టుబడితో 7.210 ఎకరాల్లో పర్యావరణ హితమైన యూనిట్ ఏర్పాటుకు ముందుకు రావడం అభినందనీయమని చెప్పారు. ఈ పరిశ్రమ ఏర్పాటుతో సుమారు 1,350 మందికి పైగా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. అరబ్ దేశాల్లో అత్యంత ప్రాచుర్యం పొందిన ఎబిస్టా కంపెనీకి అనుబంధంగా అభివృద్ధి చెందుతున్న "టెక్నో డోమ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్" కన్స్యూమర్ ఎలక్ట్రానిక్ కంపెనీ వైఎస్ ఆర్‌ఈఎంసిలో రూ.52 కోట్ల పెట్టుబడితో ఉత్పత్తి యూనిట్‌ను ఏర్పాటు చేసేందుకు పెండింగ్‌లో స్థాపన చేశామని పేర్కొన్నారు. కొప్పర్తిలో రూ. 100 కోట్ల పెట్టుబడితో ఆడియో సిస్టం భాగాలను ఉత్పత్తి చేయనుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి, సిఎం ముఖ్యకార్యదర్శి ధనుంజయ రెడ్డి, ఒఎస్‌డి కృష్ణమోహన్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి.అంజాద్‌బాషా, ఇన్‌ఛార్జి మంత్రి ఆదిమూలపు సురేష్, శాసనమండలి డిప్యూటీ చైర్‌పర్సన్ జకియాఖానమ్, ఎంపీ అవినాష్‌రెడ్డి, మేయర్ సురేష్‌బాబు, జడ్పి చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, ఎమ్మెల్సీలు గోవిందరెడ్డి, రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యేలు రఘురామిరెడ్డి, సుధీర్ రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి, మేడా మల్లికార్జునరెడ్డి, రాష్ట్ర వ్యవసాయ సలహాదారు తిరుపాల్‌రెడ్డి, ఉద్యాన సలహాదారు శివప్రసాద్‌రెడ్డి, కలెక్టర్ విజయరామరాజు, ఎస్‌పి అన్బురాజన్, జెసి గణేష్‌కుమార్ పాల్గొన్నారు.

కడప నగరంలోని రాజీవ్‌మార్గ్, రాజీవ్ పార్కులను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి

కదంతొక్కిన అంగన్వాడీలు

- డిమాండ్ల సాధన కోసం 36 గంటల నిరసన
- ఐసిడిఎస్‌కు బడ్జెట్ పెంచాలి
- కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

తమ కోర్కెల సాధన కోసం అంగన్వాడీలు కదం తొక్కారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట సుమారు 3 వేలకు పైగా అంగన్వాడీలు 36 గంటల ధర్నాలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తమకు ప్రభుత్వం నుంచి వచ్చే సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ధర్నాను ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) అధ్వర్యంలో జిల్లా ప్రెసిడెంట్ శ్రీలక్ష్మి ప్రధాన కార్యదర్శి పి.రాజేశ్వరి వర్కింగ్ ప్రెసిడెంట్ డి.భాగ్యలక్ష్మి జిల్లా కోశాధికారి పి.ఐం గారుపాప జిల్లా ఉపాధ్యక్షురాలు పి భాజాబీ జిల్లా కార్యదర్శి యస్ ఓబులమ్మ సారథ్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ. రామాంజులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఐసిడిఎస్‌కు బడ్జెట్‌లో ఎనిమిదేళ్లుగా అన్యాయం చేస్తున్నాయని వాపోయారు. ఏళ్ల తరబడి పనిచేసినా కనీసవేతనం ఇవ్వకుండా శ్రమదోపిడీ చేయడం తగదన్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని వయో పరిమితితో సంబంధం లేకుండా గ్రేడ్ - 2 సూపర్‌వైజర్ పోస్టులకు అవకాశం ఇవ్వాలని కోరారు. రిటైర్మెంట్ బెనిఫిట్ సౌకర్యం రూ. 5 లక్షలు కల్పించాలని. హెల్పర్లకు ప్రమోషన్లు కల్పించాలన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు సి రవి కుమార్ మాట్లాడుతూ సకాలంలో వేతనాలు బిల్లులు ఇవ్వాలని పేర్కొన్నారు. వర్కర్లకు నాణ్యమైన సెల్ ఫోన్లు, అవసరం ఉన్న చోట బదిలీలు అమలు చేయాలన్నారు. యాప్‌ల పనిభారం తగ్గించాలని కోరారు. పనికి తగ్గ వేతనం అమలు చేసి కనీసవేతనం రూ. 26 వేలివ్వాలని, ఇఎస్ఐ, పిఎఫ్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో చనిపోయిన అంగన్వాడీల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని పేర్కొన్నారు. అంగన్వాడీలు పోరాటానికి కార్మిక కర్షక ఆందోళనకు ఎల్లవేళలా ముందుంటామని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. రామచంద్ర, కె. నాగులసిరెడ్డి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు యస్ ఫయాజ్, జిల్లా నాయకులు రమాదేవి, గంగ, ముద్దురావాణి భూక్తేశ్వరి, ఈశ్వరమ్మ, కరుణ, భాజాబీ, విజయ, జిల్లా నలుమూలల అంగన్వాడీలు పాల్గొన్నారు.

సర్వే లక్ష్యాన్ని వంద శాతం సాధించాలి : జెసి

ప్రజాశక్తి - రాయచోటి

ఎన్‌సిడిసిడి సర్వే లక్ష్యాన్ని వందశాతం సాధించాలని అధికారులను జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్ ఖాన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హల్ నుంచి వైద్య ఆరోగ్య శాఖ జిల్లా అధికారులు, జిల్లాలోని పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, ఎమ్ ఎల్‌హెచ్‌పిలు, ఎన్‌ఎంలతో అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ జిల్లా ఎన్‌సిడిసిడి సర్వేలో 83 శాతం మాత్రమే లక్ష్యం సాధించామని, వందశాతం పూరిత చేయాలని ఆదేశించారు. గతవారంతో పోల్చి చూస్తే ఈ వారం ఐదు శాతం మాత్రమే పురోగతి ఉందన్నారు. ఇలాంటి ప్రగతి కాకుండా వందశాతం లక్ష్యం చేరుకునేలా పనిచేయాలని వైద్యాధికారులు ఎఎన్‌ఎంల వారిగా సమీక్షలు నిర్వహించాలన్నారు. తక్కువ పెర్ఫార్మెన్స్ ఉన్న మదనపల్లి అర్బన్ యుపి హెచ్‌సి, రాయవరం తరిగొండ, నందలూరు, చిట్వేల్ వైద్యులతో కారణాలు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌లో బిపి, షుగర్ జబ్బుల అనుమానిత కేసుల స్క్రీనింగ్ పెండింగ్ ఉన్న పిహెచ్‌సిల వైద్యులును సమీక్ష చేశారు. వీలైనంత తొందరగా స్క్రీనింగ్ పూర్తి చేసి చికిత్స అందించాలని ఆదేశించారు. రక్తహీనత, హెచ్‌బి టెస్టింగ్స్, కంటి వెలుగు కార్యక్రమంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. కాన్పులు జరగకుండా ఉన్న పి హెచ్ సిలైన మెడికుర్తి, తరిగొండ, కురబలకోట వైద్యాధికారులులను కాన్పులు పి హెచ్‌సిలో చేసేలా ప్రణాళికలు రూపొందించి కాన్పులు చేయా లన్నారు. మాతృ,శిశు మరణాలు జరగకుండా ముందస్తు అనుభవం దృష్టిలో ఉంచుకుని ప్రణాళికలు చేపట్టా లన్నారు. కార్యక్రమంలో డిఎంహెచ్‌ఒ డాక్టర్ కొండయ్య, ప్రోగ్రాం ఆఫీసర్లు, జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు, ఎమ్‌ఎల్‌హెచ్‌పిలు, ఎఎన్‌ఎంలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

నాణ్యమైన వైద్యం అందించాలి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

నాణ్యమైన సేవలు అందించాలని శాసన మండలి డిప్యూటీ చైర్‌పర్సన్ జకీయ ఖానం, డాక్టర్ బలరామ రాజు అన్నారు. పట్టణంలోని సుండుపల్లె రహదారి మార్గంలో డాక్టర్ ఎస్.ముకరంబాషా ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన సిటీ పిల్స్, జనరల్ ఆస్పత్రిని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆస్పత్రి నిర్వాహకులు ప్రజలకు విలువలతో కూడిన వైద్యం అందించాలన్నారు. ప్రజల ఆశీర్వాదాలే లక్ష్యంగా వైద్యం అందించాలని కోరారు. జిల్లా కేంద్రం ఏర్పాటు తర్వాత రాయచోటిలో ఆధునాతన వైద్యసేవలు ఒక్కొక్కటిగా అందుబాటులో వస్తుండటం సంతోషకరమని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఎక్కడికక్కడ వైద్యం అందుబాటులోకి తీసుకురావాలన్న లక్ష్యంతో ముందుకెళ్తుందన్నారు. వైఎస్‌ఆర్ పట్టణ ఆరోగ్య కేంద్రాలు, వైఎస్‌ఆర్ గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు, ప్రతి పార్లమెంట్‌లో వైద్య కళాశాలల ఏర్పాటు, ఇప్పటికే ఉన్న ప్రభుత్వ ఆస్పత్రుల్లో అత్యాధునిక వైద్య సేవలు అందేలా నూతన పరికరాల ఏర్పాటు, పడకల పెంపు, వైద్య సిబ్బంది నియామకం లాంటి చర్యలు వేగంగా అమలు చేస్తున్నామన్నారు. రాయచోటి ప్రజలకు అందుబాటులో ఉండాలని కోరారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు సయ్యద్ అష్రఫ్ అలీ, ముజఫర్ బాషా, రాయచోటి జి సయ్యద్ షర్ఫుద్దీన్, డాక్టర్ భాస్కర్ రెడ్డి,డాక్టర్ మహేశ్వర్ రాజు పాల్గొన్నారు.

సంతృప్తి స్థాయిలో అర్జీలను పరిష్కరించాలి : జెసి

ప్రజాశక్తి - రాయచోటి

ప్రజల్లో సంతృప్తిస్థాయి పెంచే విధంగా స్పందన జగనన్నకు చెబుదాం అర్జీల పరిష్కారం ఉండాలని జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్ ఖాన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లోని స్పందన హాలు నందు ప్రజా ఫిర్యాదుల స్వీకరణ స్పందన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి జెసి, డిఆర్‌ఒ సత్యనారాయణ, డిఆర్‌డిఎ పీడీ సత్యనారాయణ హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ స్పందన జగనన్నకు చెబుతాం అర్జీల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి ఎప్పటికప్పుడూ సత్వరమే పరిష్కరించాలని సూచించారు. ఎలాంటి సమస్యకైనా నిర్దేశిత గడువులోగా పరిష్కారం ఉండాలన్నారు. స్పందనలో అందిన అర్జీలను నిర్ణీత సమయంలో పరిష్కరించడానికే అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పూర్తిగా పరిశీలించి పారదర్శకంగా విచారణచేసి అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. స్పందన అర్జీలు ఎట్టిపరిస్థితిలో పెండింగ్‌లో ఉండకూడదని, వచ్చింది వచ్చినట్లు ఏ రోజుకారోజు పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మార్గమధ్యలో ఆగిన ఆర్‌టిసి బస్సు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి నర్సింగ్ కళాశాల వద్ద సోమవారం బద్వేల్ డిపోకు చెందిన ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు ఆగిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. బెంగుళూర్ నుంచి బద్వేల్‌కు వెళుతుండగా రాయచోటి నర్సింగ్ కళాశాల వద్దకు రాగానే సాంకేతిక లోపం కారణంగా ముందుకు కదలకుండా ఆగిపోయింది. డ్రైవర్ సుమారు రెండు గంటల పాటు ఎంత ప్రయత్నించినా ముందుకు కదలలేదు. దీంతో చేసేది లేక అటు నుంచి బద్వేల్ డిపోకు చెందిన మరో బస్సు రావడంతో ప్రయాణికులకు ఎక్కించి పంపారు. దీంతో ప్రయాణికులు ఆసౌకర్యానికి గురి అయ్యారు. దూర ప్రాంతాలకు నడిపే సర్వీసులు మంచి కండిషన్‌లో ఉండే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

అర్జీదారుల సమస్యలకు మొదటి ప్రాధాన్యత : ఎస్‌పి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

స్పందనలో వచ్చే అర్జీదారుల సమస్యలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ఎస్‌పి ఆర్. గంగాధర్‌రావు అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో స్పందనలో భాగంగా 67 ఫిర్యాదులను ఆయన స్వీకరించారు. అర్జీదారుల సమస్యలను సానుకూలంగా స్పందించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సంబంధిత పోలీస్ స్టేషన్‌కు చరవాణి ద్వారా స్పందన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించి న్యాయం చేయాలని, ఎట్టి పరిస్థితుల్లో కూడా స్పందన ఫిర్యాదుల పట్ల ఆలసత్వం వహించకూడదని అధికారులకు ఆదేశించారు. 67 మంది వారి సమస్యలను ఫిర్యాదు రూపంలో అందించారు. స్పందన కోసం వచ్చిన ఫిర్యాదు దారులకు చట్టప్రకారం విచారించి నిర్దేశించిన గడుపులోగా సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

మహిళతో మాట్లాడుతున్న ఎస్‌పి గంగాధర్‌రావు

పీలేరు రైల్వేస్టేషన్‌లో అన్ని రైళ్లకు స్టాపింగ్

- స్టేషన్ సూపరింటెండెంట్ వెంకట సుబ్బారావు

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు రైల్వేస్టేషన్లో అన్ని రైళ్లు ఆగుతున్నట్లు స్టేషన్ సూపరింటెండెంట్ వెంకట సుబ్బారావు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్థానిక రైల్వేస్టేషన్‌లో కొత్తగా ఆరు ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగడానికి రైల్వే అధికారుల నుంచి ఆదేశాలు అందాయన్నారు. పీలేరు స్టేషన్ లో కొత్తగా ఆగుతున్న ఆరు ఎక్స్‌ప్రెస్ రైళ్ల వివరాలను మీడియాకు తెలియజేశారు. 07095 నెంబరు ధర్మవరం ఎక్స్‌ప్రెస్ రైలు, సోమ, మంగళ, గురు, శనివారాల్లో ప్రయాణికులు అందుబాటులో ఉంటుం దన్నారు. ధర్మవరం వెళ్లడానికి ఉదయం 5.03 గంటలకు పీలేరుకు చేరుకుంటుందని చెప్పారు. 07096 నెంబరు మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ సోమ, మంగళ, గురు, శనివారాల్లో పీలేరుకు సాయంత్రం 18.14 గంటలకు వస్తుందని తెలిపారు. 16339 నెంబరు నాగర్ కోయిల్ ఎక్స్‌ప్రెస్ బుధ, గురు, శుక్ర, ఆదివారాల్లో మదురై వెళ్లే ప్రయాణికుల కోసం పీలేరుకు మధ్యాహ్నం 15.14 గంటలకు చేరుకుంటుందన్నారు. 16340 నెంబరు ముంబై ఎక్స్‌ప్రెస్ ముంబై వెళ్లేందుకు సోమ, మంగళ, బుధ, శుక్రవారం పీలేరుకు రాత్రి 22 04 గంటలకు వస్తుందని తెలియజేశారు. 22715 నెంబరు మధురై ఎక్ప్రెస్ ప్రతి శనివారం మదురై వెళుతూ పీలేరుకు సాయంత్రం 16.09 గంటలకు చేరుకుంటుందని పేర్కొన్నారు. 22716 నెంబరు కాచిగూడ ఎక్స్‌ప్రెస్ ప్రతి సోమవారం కాచిగూడ వెళ్లే ప్రయాణికుల కోసం ఆదివారం మధ్య రాత్రి 01 గంటకు వస్తుందని తెలిపారు. ఈ ఎక్స్‌ప్రెస్ రైళ్లన్నీ పీలేరు రైల్వే స్టేషనులో 1 నుండి 2 నిమిషాల సమయం ఆగుతాయని తెలియజేశారు. గతంలో కరోనా కాలానికి ముందు పీలేరులో ఆగుతున్న రైళ్లను తిరిగి ఇక్కడ ఆగడానికి అనుమతించాలని స్థానికంగా కొందరు ప్రజా ప్రతినిధులు, కొన్ని సామాజిక, ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు గుంతకల్ రైల్వే డివిజనల్ మేనేజర్ కె.వెంకట రమణారెడ్డిని కలసి విన్నవించుకున్నారు. డిఆర్‌ఎం విశేష కృషి ఫలితంగా పీలేరు, పరిసర ప్రాంత ప్రయాణికులకు ఎంతో సౌకర్యం కలిగింది. దినదినాభివృద్ధి చెందుతున్న పీలేరు పట్టణం నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగింది. అన్ని రైళ్లు పీలేరు స్టేషన్‌లో ఆగుతుండడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నందలూరు : రైల్వే స్టేషన్‌లో టికెట్లు తీసుకుంటున్న ప్రయాణికులు

నందలూరులో ఆగిన రైళ్లు

నందలూరు: కరోనా కారణంగా నందలూరు రైల్వే స్టేషన్‌లో పలు రైళ్లకు స్టాపింగ్స్ ఎత్తివేయడంతో స్థానిక నాయకుల చొరవతో సోమవారం నుండి రెండు రైళ్లు ఆగాయి. కడప నుండి విశాఖపట్నం వెళ్లే తిరుమల ఎక్స్‌ప్రెస్, తిరుపతి నుండి కొల్హాపూర్ వెళ్లే హరిప్రియ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు రైల్వే ఉన్నతాధికారులు నిలుపుదలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. మండల వాసులు హర్షం వ్యక్తం చేయడంతోపాటు సాయి లోకేష్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. కరోనా ముందు ఆగుతున్న ప్రతి రైలును ఆపితే ప్రజలు, విద్యార్థులు, రోగులకు మంచి జరిగే అవకాశం ఉంటుందని స్థానికులు ప్రజా ప్రతినిధులను, అధికారులను కోరుకుంటున్నారు.

విద్యార్థులను గ్లోబల్ సిటిజన్స్‌గా తీర్చిదిద్దాలి

- డిప్యూటీ డిఇఒ వరలక్ష్మి

మాట్లాడుతున్న డిప్యూటీ డిఇఒ వరలక్ష్మి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

విద్యార్థులను ఉపాధ్యాయులు గ్లోబల్ సిటిజన్లుగా తీర్చిదిద్దాలని డిప్యూటీ డిఇఒ వరలక్ష్మి అన్నారు. బోయనపల్లిలోని అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం డిజిటల్ విద్యా బోధనపై ఉపాధ్యాయులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజంపేట, రైల్వేకోడూరు, పుల్లంపేట, ఓబులవారిపల్లె, చిట్వేలి, పెనగలూరు, సుండుపల్లె, వీరబల్లి మండలాలకు సంబంధించిన ప్రభుత్వ ఉపాధ్యాయులు హాజరయ్యారు. డిజిటల్ ఎడ్యుకేషన్‌పై శిక్షణ ఇచ్చామన్నారు. మూడు బ్యాచ్‌లలో 1200 మందికి శిక్షణ అందించనున్నామన్నారు. ఒక బ్యాచ్‌కు 400 మంది చొప్పున ఈనెల పది నుంచి 15వ తేదీ వరకు శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఒక బ్యాచ్‌కు రెండురోజులు శిక్షణ ఇస్తామని తెలిపారు. ప్రభుత్వం విద్యార్థులను గ్లోబల్ సిటిజన్లుగా ప్రపంచంతో పోటీపడే విధంగా తయారు చేయాలనే దృఢ సంకల్పంతో డిజిటల్ ఎడ్యుకేషన్ ప్రారంభించిందని పేర్కొన్నారు. ప్రభుత్వం ఉపాధ్యాయులకు రెండురోజుల శిక్షణా కార్యక్రమంలో ఐఎఫ్‌ను ఎలా వినియోగించుకోవాలి, బైజూస్ కంటెంట్ ఎలా ఉపయోగించాలి అనే అంశాలతో పాటు ఇ-లర్నింగ్‌పై శిక్షణ ఇవ్వబడుతుందన్నారు. విద్యార్థుల అభివ ృద్ధికోసం ప్రభుత్వం కోట్లాది రూపాయలను వెచ్చించి అధునాతన సాంకేతిక పద్ధతులు ద్వారా విద్యను అందిస్తుందని, ఉపాధ్యాయులు కూడా అందుకు తగ్గట్టుగా సరళమైన విద్యాబోధనను విద్యార్థులకు అందించాలని సూచించారు. కార్యక్రమంలో రాజంపేట మండల విద్యాశాఖ అధికారులు రఘునాధ రాజు, సుబ్బరాయుడు, రాష్ట్ర అబ్జర్వర్ ఎస్.రెహ్మాన్, కళాశాల వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్‌ఎంవి నారాయణ, ఆర్గనైజర్లు వై.సుబ్రమణ్యం రాజు, జి.ఆదినారాయణరెడ్డి, ఎఎస్‌ఒ కె.నాగేంద్రరెడ్డి, డీఎస్‌ఓ సి.సుధాకర్, అన్నమాచార్య కళాశాల ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్, హెచ్‌ఒడి సిఎస్‌ఇ డాక్టర్ ఎం.సుబ్బారావు, శిక్షకులు కె.కర్పగవల్లి, జి.వెంకటేష్ గౌడ్‌తో పాటు పది మంది సంయుక్త శిక్షకులు పాల్గొన్నారు.

రాయచోటి యువకుడికి అరుదైన గౌరవం

ప్రజాశక్తి - రాయచోటి

ఉత్తమ సేవలతో ప్రజల్లో గుర్తింపు పొందిన రాయచోటికి చెందిన యువకుడు వినయ్ కుమార్‌కు అరుదైన గౌరవం లభించింది. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ తాను చేసిన సేవలకు గాను పంచరామలింగేశ్వర పురస్కారం ఉత్తమ సేవ పురస్కారాన్ని భీమవరంలోని సోమరామ ఆలయంలో వాగ్దేవి వాద్య సంగీత కళా నృత్య సాంస్కృతిక సంస్థ వారి అధ్వర్యంలో ప్రముఖులు కళారత్న భారతి, ప్రపంచ కూచిపూడి డే సృష్టికర్త డాక్టర్ భావన, ఆలయ చైర్మన్ విజయలక్ష్మి, ఘంటసాల పవన్ కుమార్, ఆలయ ఇఒ సురేష్ నాయుడు , యువ నాయకుడు రవితేజ చేతుల మీదుగా అందుకున్నట్లు తెలిపారు. తను విద్యార్థి దశ నుంచే పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నాని చెప్పారు. ఐదేళ్లుగా రక్తదాన కార్యక్రమాలు, మెడికల్ క్యాంప్‌లు, అన్న దానం, విద్యార్థులకు ఉచిత రక్త నిర్ధారణ పరీక్షలు, కంటి పరీక్షలు, విస్తృతంగా మొక్కలు నాటే కార్యక్రమాలు , యువతకు అవగాహన సదస్సులు నిర్వహించడం వంటి విస్తృత స్థాయి సేవ కార్యక్రమాలు చేశానన్నారు. సేవలకు గుర్తింపుగా పురస్కారాలు అందుకోవడం పట్ల వినయ్ కుమార్‌ను పలువురు ప్రముఖులు అభినందించారు.

దళిత కుటుంబానికి న్యాయం చేయండి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

దళిత కుటుంబానికి నాయ్యం చేయాలని ఎపి దళిత మిత్ర సంఘం జిల్లా అధ్యక్షుడు కె.కిషోర్ బాబు డిమాండ్ చేశారు. సోమవారం స్పందన కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ కార్యాలయంలో డిఆర్‌ఒకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలోని కురబల కోట మండలం తెట్టు గ్రామం పెద్ద దళిత వాడకు చెందిన చుక్క హరినాథ్ మరణించి 4 నెలలు కావస్తున్నా న్యాయం జరగలేదని తెలిపారు. శరీరం పై రక్తపు గాయాలు ఉంటే పోస్టుమార్టం రిపోర్టు తారుమారు చేసి ఎలాంటి గాయాలు లేవని డాక్టర్లు నిర్ధారించారని అన్నారు. చుక్క హరినాథ్ మృతదేహానికి అధికారులు మళ్లీ పోస్టుమార్టం నిర్వహించి దళిత కుటుంబానికి నాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో మృతుని భార్య సంధ్య వారి పిల్లలు మిత్ర, సంఘం నాయకులు పాల్గొన్నారు.

చైతన్య రథయాత్రకు తరలిరండి

ప్రజాశక్తి- చిన్నమండెం

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బాబు యువగళం పాదయాత్ర మంగళవారం 2 వేలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా సంఘీభావంగా భవిష్యత్తుకు చంద్రబాబు గ్యారెంటీ చైతన్య రథయాత్రను ఉదయం 10.30 గంటలకు గుట్టపల్లి వద్ద ప్రారంభమవుతుందని మండల క్లస్టర్ ఇన్‌చార్జి హరినాథ్ పేర్కొన్నారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇళ్ల పరిశీలన, మధ్యాహ్నం మూడు గంటలకు శిబ్యాల వద్ద ఉన్న టిడ్కో గృహాల సందర్శన, తరువాత చల్లంపల్లె రింగ్ రోడ్డు వద్ద రచ్చబండ కార్యక్రమం నిర్వహిస్తారని తెలిపారు. తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు ,అభిమానులు, మాజీ సర్పంచులు, మాజీ మండల అధ్యక్షులు, మాజీ జడ్‌పిటిసిలు, అనుబంధ సంఘాల నాయకులు, రాష్ట్ర నాయకులు మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్లు ప్రతి ఒక్కరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నేడు సుండుపల్లెకు ఎమ్మెల్యే రాక

ప్రజాశక్తి-సుండుపల్లె

రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష పథకంలో భాగంగా మంగళవారం సుండుపల్లెకు రాజంపేట శాసనసభ్యులు మేడా మల్లికార్జునరెడ్డి రానన్నట్లు రాయవరం సర్పంచ్ మహమ్మద్ షరీఫ్ ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దినేని కాలువ , సుండుపల్లె పంచాయతీలకు చెందిన లబ్ధిదారులకు పత్రాలు అందజేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమానికి ఎంపిటిసిలు, సర్పంచులు, కార్యకర్తలు పాల్గొనాలన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : 'చింతల'

ప్రజాశక్తి- కలకడ

ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలు సుభిక్షంగా ఉన్నారని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని ముదియంవారిపల్లి పంచాయతీలో ముదియంవారిపల్లి, బోయకొండవారిపల్లి, కొత్తపల్లి, గుర్రంవాండ్లపల్లి, లలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న పేద బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతిగా ముఖ్యమంత్రి నిలిచారని కొనియాడారు. దేశంలో ఏ రాష్ట్రం చేయలేని అభివృద్ధిని చేస్తున్న ముఖ్యమంత్రి చరిత్ర పుటల్లో నిలిచిపోవడం ఖాయమని తెలియజేశారు. ముదియంవారిపల్లి పంచాయతీలో ప్రతి ఇల్లు తిరిగి ప్రతి కుటుంబం లబ్ధి పొందిన అర్హతలను పరిశీలించి ప్రజలను అడిగి ప్రజల స్థితిగతులను తెలుసుకున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చేస్తున్న అభివృద్ధిని చూసి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని, వచ్చే ఎన్నికల్లో తిరిగి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం ఖాయమని జోస్యం పలికారు. కార్యక్రమంలో ఎంపిపి శ్రీదేవి రవికుమార్, సింగల్ విండో చైర్మన్ కమలాకర్‌రెడ్డి, ముదియంవారిపల్లి, కోన సర్పంచులు శాంతమ్మ, రాజగోపాల్‌రెడ్డి, సచివాలయం కన్వీనర్ మోహన్ రాజా నాయుడు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

సమస్యల పరిష్కారంలో అధికారుల నిర్లక్ష్యం : జనసేన

మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న జనసేన నాయకులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

దశాబ్దం ముందు మదనపల్లె చుట్టూ ఏర్పడిన కాలనీలకు పేర్లు పెట్టారనీ అక్కడి జనం పడుతున్న కష్టాలను పట్టించుకోకుండా మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని జనసేన రాయల దక్షిణ కోస్తా సంయుక్త పార్లమెంటరీ సమన్వయకర్త మైఫోర్స్ మహేష్ ఆరోపించారు. సోమవారం జనసేన నాయకులు కార్యకర్తలతో కలిసి మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజ దృష్టికి తీసుకువచ్చారు. వారంలోగా సమస్య పరిష్కారానికి చొరవ చూపకపోతే కాలనీ వాసులతో కలిసి వచ్చే సోమవారం నుండి మున్సిపల్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్ష చేపడుతామని హెచ్చరించారు. మున్సిపాలిటీ పరిధిలోని చంద్ర కాలనీ, అనపగుట్ట, మంజునాథ కాలనీ, బి.కె.పల్లిలో ఇంటికి మంచినీటి సౌకర్యం, రోడ్లు, మురికి నీటి కాలువలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మైఫోర్స్ మహేష్ ఆద్వర్యంలో చేపట్టిన జనం కోసం జనసేన కార్యక్రమంలో ప్రత్యక్షంగా చూసిన సమస్యలను ఆయా కాలనీ వాసులతో కలిసి నెల రోజుల క్రితం పిర్యాదు చేయడం జరిగిందన్నారు. పేరుకు మాత్రమే ప్రజా ప్రతినిధులు వున్నారని ప్రజా సమస్యలు పరిష్కారానికి మాత్రం చోరవ చూపడం లేదని ఆరోపించారు. బి.కె. పల్లిలో పాలకుల వైఫల్యం కన్నులకు కట్టినట్లు కనిపిస్తోందన్నారు. ప్రజల కనీస సౌకర్యాలు కల్పించడంలో వైఫల్యం చెందిన పాలకుల కళ్ళు తెరిపించడానికి వచ్చే సోమవారం నుండి మున్సిపాలిటీ ఎదుట రీలే నిరాహార దీక్షలు చేపడుతామని ప్రకటించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు శోభ, సునీత, శ్రీనాథ్, నరేష్, నాగేంద్ర, సోను, హర్ష పాల్గొన్నారు.

'ఉపాధి' కూలీల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి-ములకలచెరువు

ఉపాధి హామీ కూలీల పట్ల సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు చేపడుతామని అంబుడ్స్ పర్సన్ శివశంకర్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని పాతములకలచెరువు, ములకలచెరువు, నాయుని చెరువుపల్లి తదితర గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. అనంతరం ఉపాధి వేతనదారులతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కూలీలకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రభుత్వం కూలీల కోసం ఉపాధి పనులను నిర్వహిస్తోందని తెలిపారు. ప్రతి ఒక్కరూ పనికోసం దరఖాస్తు చేసుకుంటే వారికి వెంటనే పని కల్పించాల్సిన బాధ్యత ఉపాధి సిబ్బంది తీసుకుంటారని పేర్కొన్నారు. అలా దరఖాస్తు చేసుకున్న వారికి పని కల్పించకుంటే చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎపిఒ నారాయణస్వామి, జెఇ నాగరాజు, టెక్నికల్ అసిస్టెంట్ రమేష్ సాయి, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సమస్యలు అడిగితెలుసుకుంటున్న శివశంకర్

మానవత్వం చాటుకున్న సిఐ లింగప్ప

- గాయపడ్డ వ్యక్తిని సొంత వాహనంలో ఆస్పత్రికి తరలింపు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

మదనపల్లెకి చెందిన జగన్నాథం తన భార్యతో కలిసి ద్విచక్ర వాహనంలో సోమవారం మదనపల్లి నుంచి రాయచోటికి బయలుదేరారు. పట్టణ శివారులోని గొర్లముదివీడు వద్దకు రాగానే బెంగళూరు-కడప జాతీయ ప్రధాన రహదారిపై ద్విచక్ర వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో జగన్నాథం తీవ్రంగా గాయపడి రోడ్డుపై పడిపోవడంతో ఆ సమయంలో అటు వైపుగా చిన్నమండం నుంచి రాయచోటి వెళ్తున్న రూరల్ సిఐ లింగప్ప వెంటనే స్పందించి వెంటనే గాయపడ్డ వ్యక్తిని తాను ప్రయాణిస్తున్న పోలీస్ వాహనంలోనే హుటాహుటినా రాయచోటి ప్రభుత్వాస్పత్రికి తరలించి మానవత్వం చాటుకున్నారు. సకాలంలో స్పందించి తీవ్రంగా గాయపడ్డ క్షతగాత్రుడిని ఆసుపత్రిలో చేర్పించి ఓ ప్రాణాన్ని కాపాడిన సిఐని పలువురు అభినందించారు. గతంలోనూ ఎన్నో ప్రమాదాలల్లో గాయపడ్డ వారిని రక్షించడంతో పాటు వీరబల్లి కస్తూర్బా పాఠశాలల్లో జరిగిన వంట గ్యాస్ ప్రమాదాన్ని సైతం లెక్క చేయకుండా నివారించి అక్కడే 10వ తరగతి పబ్లిక్ పరీక్ష రాస్తున్న విద్యార్థులను కాపాడి ప్రజలు, విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం నుంచి ప్రశంసలు పొందారు.

'యువ ఉత్సవ్'లో పాల్గొనండి

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లా స్థాయి యువ ఉత్సవాలలో యువత పాల్గొని తమ ప్రతిభను నిరూపించుకోవాలని కడప, అన్నమయ్య నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువ అధికారి కె.మణికంఠ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో శ్రీ సాయి ఇన్స్టిట్యూట్ అఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కాలేజీ , రాయచోటిలో నిర్వహిస్తామన్నారు. ఈ యువ ఉత్సవ్‌లో (పంచ్ ప్రాణ్ అఫ్ అమ్రిత్ కాల్) అనే అంశం పై పెయింటింగ్, కవితవ్యం,వ్యాస రచన, మొబైల్ ఫోటోగ్రఫీ, డిక్లేమసిన్ (ఉపన్యాస)విభాగాలలో వ్యక్తిగత పోటీలు, కల్చరల్ (గ్రూప్) పోటీలు ఉంటాయిన్నారు. జిల్లా లోని యువత ఈ పోటీలలో పాల్గొని తమ ప్రతిభను నిరూపించుకోవాలని తెలిపారు.

బాలికల వసతి గృహానికి దాతల విరాళం

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

వస్తువులు వితరణ చేసిన దాతలు

స్థానిక మోడల్ స్కూల్ బాలికల వసతి గృహానికి విద్యార్థినుల తల్లిదండ్రులు పిల్లల సౌకర్యార్థం వాటర్ ప్లాంట్ మరమ్మతులను చేయించి, వస్తువులను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ మాట్లాడుతూ హాస్టల్‌లో కావాల్సిన వస్తువులను దాతలుగా తల్లిదండ్రులను కోరగా వారు స్పందించి వస్తువుల రూపంగా మరియు ధనం రూపంగా చందాలు వేసుకొని తల్లిదండ్రులు స్వయంగా వారే వితరణ చేశారని తెలిపారు. హాస్టల్ విద్యార్థుల తల్లిదండ్రులు కొటాలకు చెందిన విద్యార్థి చెంచమ్మ తండ్రి జి.లక్ష్మీనారాయణ, విద్యార్థి మస్తానమ్మ తండ్రి యస్ రామానుజులు పెద్దలుగా వ్యవహరించి రూ.40 వేల వస్తువులు, ఆర్వో ప్లాంట్ రిపేర్‌ను చేయించారని పేర్కొన్నారు.

విఆర్‌ఒ సంఘం రాష్ట్ర కోశాధికారిగా జాన్సన్

ప్రజాశక్తి-రామసముద్రం

ఎపి గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర కోశాధికారిగా రామసముద్రం-1 విఆర్‌ఒ విఎస్.జాన్సన్ ప్రదీప్‌కుమార్ ఎన్నికయ్యారు. ఆయనకు రాష్ట్ర స్థాయి కమిటీలో కీలక పదవి లభించినందుకు రెవెన్యూ అధికారులు హర్షం వ్యక్తం చేశారు. పదవి చేపట్టిన జాన్సన్ ప్రదీప్ కుమార్‌ను తహశీల్దారు, కార్యాలయ సిబ్బంది, విఆర్‌ఒలు, విఆర్‌ఎలు ఘనంగా సత్కరించారు.

జాన్సన్ ప్రదీప్‌కుమార్‌ను సన్మానిస్తున్న రెవెన్యూ సిబ్బంది

చైతన్య రథయాత్రతో వైసిపిలో వణుకు

- టిడిపి రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి పర్వీన్‌తాజ్

ప్రజాశక్తి - బి.కొత్తకోట

తెలుగుదేశం పార్టీ అధినేత,మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లే ఉద్దేశంతో తలపెట్టిన భవిష్యత్తుకు గ్యారెంటీ చైతన్య రథయాత్రతో వైసీపీ శ్రేణుల్లో గుబులు పుట్టిస్తుండగా, టిడిపి శ్రేణుల్లో సరికొత్త జోష్ నింపుతోందని టిడిపి రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి ఎస్.ఎం.ఫర్వీన్ తాజ్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం ఈ రథయాత్ర ఉమ్మడి చిత్తూరు జిల్లాలో సాగుతోందని, మదనపల్లి నియోజకవర్గంలో భవిష్యత్తుకు గ్యారంటీ చైతన్య రథయాత్ర కొనసాగిందన్నారు. ఈ రథయాత్రలో తనతోపాటు టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి, రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు ఆర్.శ్రీనివాసరెడ్డి, రాజంపేట పార్లమెంట్ అభ్యర్థి గంట నరహరి, మదనపల్లి నియోజకవర్గం ఇన్‌ఛార్జి దొమ్మలపాటి రమేష్, రాష్ట్ర తెలుగుయువత అధ్యక్షులు శ్రీరామ్ చినబాబు, మదనపల్లి మాజీ శాసన సభ్యులు షాజహాన్ బాషా, మదనపల్లి యువనాయకులు యశస్విరాజ్, రాజంపేట పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి యాలగిరి దొరస్వామి నాయుడు, రాజంపేట పార్లమెంట్ బీసీ సెల్ అధ్యక్షులు పి.సురేంద్ర యాదవ్, రాష్ట్ర ఎస్సీసెల్ కార్యదర్శి శివ, రామసముద్రం మండలం అధ్యక్షులు విజయ్ గౌడ్,మాజీ అధ్యక్షు కృష్ణంరాజు యాదవ్, నాయకులు రాటకొండ మధుబాబు, మదనపల్లి పట్టణ అధ్యక్షులు భవాని ప్రసాద్, రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధి ఆర్.జె.వెంకటేష్ పాల్గొన్నారు.

బోరు ఏర్పాటుకు రూ.50 వేలు సాయం

ప్రజాశక్తి-రాజంపేట రూరల్

ఎంతో కాలంగా నీటి సమస్యతో సతమతమౌతున్న మండల పరిధిలోని లక్షుంపల్లె గ్రామస్తులకు ఎమ్మెల్యే మేడా మల్లిఖార్జునరెడ్డి మంచి నీటి బోరు ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీర్చారు. వైసిపి నాయకులు దాసరి పెంచలయ్య శవనవారిపల్లె గ్రామ పంచాయతీలోని లక్షుంపల్లె ప్రజలు ఎదుర్కొంటున్న నీటి సమస్యను ఎమ్మెల్యే మేడా దృష్టికి తీసుకుపోగా వెంటనే స్పందించిన ఆయన సోమవారం గ్రామంలో మంచి నీటి బోరు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మేడా మాట్లాడుతూ ఎంపీ నిధులు కింద పైపు లైను, మోటారు ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా లక్షుం పల్లె గ్రామస్తులు ఎమ్మెల్యే మేడాకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు దాసరి పెంచలయ్య, రమణారెడ్డి, శంకర్‌రెడ్డి, చంద్రారెడ్డి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

కేన్సర్ రోగులకు కేశదానం

మదనపల్లె అర్బన్: కేన్సర్ బాధితుల మోహల్లో చిరునవ్వు చిందించడానికి హెల్పింగ్ మైండ్స్ గొప్ప సంకల్పంతో తలపెట్టిన హెయిర్ డోనేషన్ కార్యక్రమానికి మహిళలు, అమ్మాయిలు స్వచ్ఛం దంగా ముందుకు వచ్చి కేశాలు దానం చేస్తున్నారు. సోమవారం శానిటోరియానికి చెందిన సంఘవి, మదనపల్లెకు చెందిన కవిత హెల్పింగ్ మైండ్స్ కార్యాలయానికి విచ్చేసి స్వచ్ఛందంగా తమ కేశాలను దానం చేశారు. వారికి ప్రశంస పత్రంతో పాటు పూలమొక్కలు బహుకరించి అభినందించారు. ఈ సందర్భంగా హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకుడు అబూబక్కర్ సిద్దిక్ మాట్లాడుతూ వయసులో చిన్న వారైనా సేవా గుణంలో గొప్ప మనసును చాటుకుంటూ చిన్నారులు, యువతులు కేశాలు దానం చేయడం గొప్ప విషయమని పేర్కొన్నారు. ఇప్పటికే 34 మంది స్వచ్ఛందంగా ముందుకు వచ్చి కేశాలు దానం చేసారని, రాష్ట్ర వ్యాప్తంగా కేన్సర్ బాధితులకు ఎవరికైనా విగ్గులు కావాలంటే తమ సంస్థ ఉచితంగా పంపిణీ చేస్తుందని పేర్కొన్నారు.

కేశాలు దానం చేసున్న చిన్నారులు

బోద కొట్టం దగ్ధం

సుండుపల్లి: మండల పరిధిలోని మడితాడు పంచాయతీ జికె.రాచపల్లిలో రజియాబి అనే మహిళకు చెందిన బోధ కొట్టం దగ్ధమైంది. ఆదివారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో బోద కొట్టం కాలిపోయిందని తెలిపారు. ఇంట్లో ఉన్న బట్టలు, బియ్యం, పాత్రలు, నిత్యావసర సరుకులు మొత్తం కాలిపోయాయని, కట్టుబట్టలతో మిగిలామని ఆమె తెలిపారు. విఆర్‌ఒ నరసింహులు సమాచారం అందుకుని జరిగిన నష్టాన్ని అంచనా వేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామని తెలియజేశారు. బోద కొట్టం దగ్ధంతో పూర్తిగా నష్టపోయామని తమకు ఆదుకోవాలని బాధితురాలు కోరారు.

రైతులకు సూచనలు చేస్తున్న డాక్టర్ కె.ప్రతాప్

మందరంలో పశు విజ్ఞాన బడి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పశువారోత్సవాల్లో భాగంగా మందరం రాచపల్లిలో సోమవారం పశుసంవర్ధక శాఖ పశు సంచాలకులు డాక్టర్ కె.ప్రతాప్ ఆధ్వర్యంలో పశు విజ్ఞానబడి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ రకాల పశుగ్రాసాల సాగు గురించి వివరించారు. సూపర్ నేపియర్, రెడ్ నేపియర్, ఎపిబిఎన్, సిఒ-1 వంటి వివిధ రకాల పశుగ్రాసాల సాగుబడి, వాటి ప్రాముఖ్యత గురించి వివరించారు. అత్తిరాల పశువైద్యాధికారి భాగ్యవతి మాట్లాడుతూ పశువులలో యాజమాన్య పద్ధతులు, వివిధ రకాల వ్యాధుల నుండి పశువులను రక్షించుకునే విధానాలను వివరించారు. కార్యక్రమంలో జెవిఒ వరదయ్య, మందరం రైతు భరోసా కేంద్ర పశువైద్య సహాయకులు ఎ.విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులను పరిష్కరించండి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

స్పందన కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులపై తగిన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజ తెలిపారు. సోమవారం పురపాలక కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో ప్రజలు తీసుకొచ్చిన అర్జీలను తీసుకున్నారు. మొత్తం ఐదు సమస్యలు వచ్చాయన్నారు. జె.చిన్న రెడ్డెప్ప బిడ్డొకొ ఇంటికి సుమారు ఆరేళ్ల క్రితం డబ్బులు చెల్లించానని ఇంకా ఇల్లు ఇవ్వలేదని ఫిర్యాదు చేశారు. తనకు పింఛన్ మంజూరు చేయాలని షేక్ అబ్దుల్ సుభహాన్, బి.కె.పల్లి, వైఎస్ఆర్ నగర్ ప్రజలు తమ కాలనీలో నీటి పైపు లైను మంజూరు చేయాలని, సిటిఎం రోడ్డు సిండికేట్ బ్యాంకు వద్ద ఉన్న కాలువను తీయుట గురించి మొదలగు సమస్యలు వచ్చినట్టు తెలిపారు. పై వచ్చిన ఫిర్యాదులపై కమిషనర్, చైర్‌పర్సన్ సంబంధిత అధికారులకు వెంటనే పరిష్కార నిమిత్తం ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పురపాలక సంఘంలోని అన్ని శాఖాధిపతులు పాల్గొన్నారు.

ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న వాల్మీకులు

వాల్మీకులను ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కులవృత్తి లేని వాల్మీకులను ప్రభుత్వం ఆదుకోవాలని వాల్మీకి సంఘం ఆంధ్రప్రదేశ్ వ్యవస్థాపక అధ్యక్షులు పులి శ్రీనివాసులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ సంఘం నాయకులతో కలిసి స్థానిక సబ్ కలెక్టర్ కార్యలయం ఎదుట నిరసన తెలిపి గాంధీ విగ్రహానికి, ఆర్డీఓకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పులి శ్రీనివాసులు మాట్లాడుతూ దశాబ్దాలుగా విద్యకు నోచుకోక సమాజంలో ఇమడలేక అల్లనేరేడు,మామిడి తోపులలో కాపలాదారులుగా వాల్మీకులు జీవనాన్ని కొనసాగిస్తున్నారన్నారు. అడవి జాతి బిడ్డలమైన వాల్మీకులు మాత్రమే అల్లనేరేడు సీజన్ ఉన్నప్పుడు ఎంతో పేలుసు రకానికి చెందిన అల్లనేరేడు చెట్లను వెదుర్ల ద్వారా చిట్టచివరి కొమ్మల్లో ఉన్న అల్లనేరేడు పండ్లను కూడా సేకరించే ధైర్యం ఒక్క వాల్మీకి జాతి బిడ్డలకు మాత్రమే ఉందన్నారు. ఇంత ప్రమాదకర పరిస్థితుల నేపథ్యంలో అల్లనేరేడు పండ్ల సేకరణ సమయంలో ప్రమాదవశాత్తు చెట్లనుండి కిందపడి చెయ్యి, కాలు, వెన్నుపూస, మెడ విరిగి వికలాంగులుగాను ఎంతోమంది ప్రాణాలను కోల్పోవడం జరిగిందన్నారు. కుటుంబ పెద్దను పోగొట్టుకున్న కుటుంబాలు అనేక ఆర్థిక ఇబ్బందులతో జీవనాన్ని కొనసాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాలను పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లిన న్యాయం జరుగలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వారు స్పందించి వాల్మీకులకు జరిగిన నష్టానికి వాల్మీకి కార్పొరేషన్ ద్వారా ఆర్థిక సహాయం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఏపీ వాల్మీకి సంఘం నాయకులు బొంత సోము, ముక్కండ్ల జగన్, కడపల సరోజమ్మ, కడపల శ్రీనివాసులు, వలసల మంజునాథ, నాగతాతిగారి నరసింహులు, గాది నరసింహులు, సద్దల జయసింహ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు పండ్లు, స్వీట్లు ఇస్తున్న విశ్వనాథ్

జీవిత ఆశ్రమ చిన్నారులకు పండ్లు పంపిణీ

ప్రజాశక్తి - బి.కొత్తకోట

రాయచోటిలో నివాసం ఉంటున్న పలవు విశ్వనాథ్ పుట్టినరోజు పురస్కరించుకుని సోమవారం కర్ణాటక రాజధాని బెంగుళూరులో గల జీవిత ఆశ్రమంలో 60 మంది పిల్లలకు యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వీట్స్, పాలు, బిస్కెట్ పండ్ల జ్యూస్, రసం పంపిణీ చేసినట్లు యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు రాజశేఖర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వనాథ్ పుట్టినరోజు పురస్కరించుకుని ఆశ్రమంలోని పిల్లలకి స్నాక్స్ పంపిణీ చేశామన్నారు. తమ సంస్థ తరపున నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మునిస్వామి, మహేష్, అనిల్, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

అవకాశమిస్తే అభివృద్ధి చేసిచూపిస్తాం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఒక్కసారి అవకాశం ఇస్తే రాష్ట్రంలో అభివృద్ధి ఏంటో చేసి చూపిస్తామని, రానున్న ఎన్నికల్లో రాజంపేట నుండి రాజోలు వరకు పవన్ కల్యాణ్ సారథ్యంలో జనసేన అన్ని నియోజకవర్గాలు కైవసం చేసుకోనుందని విశ్రాంత ఆర్టీసీ ఎక్సిక్యూటివ్ డైరెక్టర్, రాజంపేట జనసేన నాయకులు ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజంపేట నియోజకవర్గంలో గత నాలుగున్నర ఏళ్లలో జరగని అభివృద్ధిని తమ హయాంలో ఎలా చేసి చూపుతామో ప్రజలకు వివరించనున్నామన్నారు. రాజంపేట ప్రజల జీవనాధారమైన అన్నమయ్య ప్రాజెక్టును కొందరి స్వార్థం కోసం కూల్చివేశారని, దానిని పునర్నిర్మించడం మా బాధ్యతన్నారు. పవన్ కళ్యాణ్ పలు సమావేశాలలో అన్నమయ్య ప్రాజెక్టు గురించి ప్రస్తావించారని తెలిపారు. రాజంపేటకు మెడికల్ కలాశాల సాధించి తీరుతామన్నారు. ఈ ప్రాంతంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం మీద చాలామంది ఆధారపడి ఉన్నారని అందువల్ల రాజంపేట విస్తరణ కోసం రింగ్ రోడ్డు నిర్మిస్తామన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధికి నిధులు తీసుకొస్తామన్నారు. జరికోన ప్రాజెక్ట్ నుండి సుండుపల్లి మండలానికి తాగు, సాగు నీరు అందిస్తామని, రాజంపేట నుండి వీరబల్లి, సుండుపల్లి వెళ్ళే రోడ్ల విస్తరణ చేస్తామని, మార్కెట్ యార్డ్‌ను అభివృద్ధి చేసి రైతులకు ఉపయోగపడేలా తీర్చిదిద్దుతామని తెలిపారు. పట్టణంలోని మున్సిపల్ కూరగాయల మార్కెట్ ను అధునాతనంగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గర్భిణులకు రక్త పరీక్షలు చేస్తున్న వైద్యులు

గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు

ప్రజాశక్తి-కలకడ

మండలంలోని ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికార్లు డాక్టర్ ఎం.వి.కిషోర్ కుమార్‌రెడ్డి, డాక్టర్ జవహర్ బాబు ఆధ్వర్యంలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభయాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి నెల 9వ తేదీన జరిగే ఈ కార్యక్రమం గర్భిణులకు ఒక వరం లాంటిదని తెలిపారు. గర్భవతి ప్రతి నెలా వైద్య పరీక్షలు చేయించుకోవడం వలన హిమగ్లోబిన్ శాతం, బిసి షుగర్ వ్యాధులు కూడా బయటపడతాయని పేర్కొన్నారు. హిమోగ్లోబిన్ 10 గ్రాములు తక్కువ ఉన్న వారిని గుర్తించి వారందరికీ అంగన్వాడీ కేంద్రాలలో ఇచ్చే పౌష్టికాహారములను ఎక్కువగా తీసుకోవాలని తెలిపారు. 10 గ్రాములు తక్కువ హిమో గ్లోబిన్ ఉన్నవారికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఐరన్ సుక్రోజ్ ఇంజక్షన్ ఇవ్వటం వలన వారి హిమగ్లోబిన్ శాతం పెరుగుతుందన్నారు. ప్రతి గర్భిణి ఎంసిపి కార్డును క్షుణ్ణంగా చదువుకోవాలని, టీకాలు, మందులు సకాలంలో తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒ జి.జయరామయ్య, పిహెచ్ఎన్ సుబ్బరత్నమ్మ, సూపర్వైజర్స్ షేక్ ముజీబ్ భాష, బి.రెడ్డమ్మ, స్టాఫ్ నర్స్ భారతమ్మ, ల్యాబ్ టెక్నీషియన్ షేక్ జమీల్ అహ్మద్, ఆరోగ్య కార్యకర్తలు వాణి, శ్రీలక్ష్మి, లక్ష్మీ, భాగ్యమ్మ, ఎంఎల్‌హెచ్ పి.రాజ సులోచన, గోపికృష్ణ, లావణ్య. అశ్విని, కనకమ్మ, కార్యకర్తలు పాల్గొన్నారు. **నందలూరు:** గర్భిణులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తామని డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. 68 మంది గర్భిణులకు వైద్య సేవలు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంల్‌హెచ్‌పిలు, ఎఎన్ఎంలు, ఆశలు పాల్గొన్నారు. **పీలేరు:** తల్లి-బిడ్డ సంరక్షణ కోసం నిర్ణీత సమయాల్లో ఆరోగ్య పరీక్షలు చాలా అవసరమని తలుపుల పిహెచ్‌సి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ రమేష్‌రెడ్డి తెలిపారు. స్థానిక పిహెచ్‌సిలో గర్భిణులకు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో పిహెచ్ఎన్ ఆదిలక్ష్మి, పర్యవేక్షకులు కృష్ణయ్య, కుసుమ, ఏఎన్ఎం నాగవేణి, ల్యాబ్ టెక్నీషియన్ కుమార్, స్టాఫ్ నర్స్ లక్ష్మి, అనిత, శిరీష పాల్గొన్నారు. **నిమ్మనపల్లి :** గర్భిణిలు వైద్యుల సూచనలు తప్పక పాటించాలని డాక్టర్ రమేష్ బాబు అన్నారు. పిహెచ్‌సిలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సిహెచ్ఒ మల్లిక, హెల్త్ సూపర్వైజర్ ఏ.దేవకుమారి, ఎంపీహెచ్ఇఒ రామచంద్ర, ల్యాబ్ టెక్నీషియన్ నాగేంద్రబాబు, ఎం.ఎల్.హెచ్.పిలు, ఏఎన్ఎంలు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రేపు శ్రీనివాస డిగ్రీ కళాశాలలో మెగా జాబ్‌మేళా

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

స్థానికశ్రీనివాస డిగ్రీ కళాశాలలో హైదరాబాదుకు చెందిన ఎంఎస్ఎన్ లేబరేటరీస్ వారు ఈ నెల 12వ తేదీన ఇంటర్ ఎంపిసి, బైపిసి, డిగ్రీ బీకాం, బిఎ, బిఎస్‌సి డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు క్యాంపస్ సెలక్షన్లు నిర్వహిస్తారని కళాశాల చైర్మన్ ఎన్.కృష్ణారెడ్డి, కరస్పాండెంట్ ఎన్.శ్రీనివాసులురెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.వి.రమణాచారి తెలిపారు. 2020, 2021, 2022, 2023 సంవత్సరాలలో ఉత్తీర్ణులైన విద్యార్థులు పాల్గొనవచ్చునన్నారు. సుమారు 500 ఉద్యోగాల భర్తీ కోసం ఈ సెలక్షన్లు నిర్వహిసున్నారు. ఉద్యోగానికి ఎంపికైన వారు హైదరాబాదులో పని చేయాల్సి ఉంటుందని, ఎంపికైన విద్యార్థులకు సంవత్సరానికి రూ.2.1 నుంచి రూ.2.5 లక్షల వరకు వేతనం ఉంటుందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

రెండు మాధ్యమాల్లోనూ పరీక్షలు నిర్వహించాలి

ప్రజాశక్తి-కలికిరి

ప్రభుత్వ పాఠశాలల్లో 3వ తరగతి నుండి పరీక్షలన్నీ ఆంగ్ల మాధ్యమంలోనే నిర్వహించాలని విద్యాశాఖ ప్రిన్స్ పుల్ సెక్రటరీ ప్రకటించడాన్ని ఎపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్ యాదవ్ ఖండించారు. ప్రాథమిక స్థాయిలో విద్యార్థులు ఇప్పుడపుడే ఆంగ్లమాధ్యమంలో పరీక్షలు రాసేటంత ప్రావీణ్యం సంపాదించలేదని, అలాంటి సందర్భంలో పూర్తి ఆంగ్లమాధ్యమంలో పరీక్షలు నిర్వహణ సాధ్యపడదని కావున తమ నిర్ణయాన్ని విరమించుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు పై పనిభారం అధికమైతోందని, అత్యధిక ప్రాథమిక పాఠశాలలు ఏకోపాధ్యాయులతో సాగుతూ, సెమిష్టర్ వారి అధిక సిలబస్ భారంతో ఇబ్బంది పడుతున్నారన్నారు. తక్షణం ప్రతీ ఏకోపాధ్యాయ పాఠశాలల్లో డిఎస్‌సి నిర్వహించేవరకు తాత్కాలిక అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్స్‌ను నియమించాలని సూచించారు. ఏకోపాధ్యాయులతోనే బడులు కొనసాగిస్తూ విద్యా ప్రమాణాలు పెరగాలని ఆశించడం అత్యాసేనన్నారు. ఉపాధ్యాయులకు ప్రభుత్వ పథకాలు, ఆన్‌లైన్ పనులు, నాడునేడు పనులు భారంగా మారుతూ సమయం వృథా అవుతోందన్నారు. ఉపాధ్యాయులను తీవ్ర ఒత్తిడికి గురిచేస్తున్నారన్నారు. గ్రామీణ బడులలో చదువుతున్న పేద విధ్యార్థులు కు నిజంగా నాణ్యమైన విద్య అందాలంటే ఉపాధ్యాయులు ను బోధనకే పరిమితం చేసి, సిలబస్ తగ్గించి, ప్రతీ పాఠశాల కూ ఇద్దరు ఉపాధ్యాయులు తప్పక నియమించాలన్నారు. ఇపుడు అనుసరిస్తున్న విధానాలే ఇలాగే కొనసాగిస్తే విద్యాప్రమాణాలు దిగజారి, గ్రామాల్లో బడులు మాయమై, గ్రామీణ పేదలకు విద్య దూరమౌతుందని కుమార్ యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు.

వరద బాధితులను ఆదుకుంటాం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రెండేళ్ల క్రితం జవాద్ తుఫాను సమయంలో అన్నమయ్య డ్యాం తెగిపోవడం వలన సర్వం కోల్పోయిన డ్యామ్ పరివాహక గ్రామాలైన పులపుత్తూరు, మందపల్లి, బగ్గిడిపల్లి గ్రామాలను సోమవారం రాజంపేట జనసేన పార్టీ ఇన్‌ఛార్జి మలిశెట్టి వెంకటరమణ నాయకులతో కలిసి సందర్శించారు. వరద బాధితులకు ప్రభుత్వం అందజేసిన సహాయ సహకారాల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. పునరావాసం కింద ఇప్పటికీ తమకు పూర్తి స్థాయిలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టలేదని స్థానిక ప్రజలు మలిశెట్టితో మొర పెట్టుకున్నారు. ఈ సందర్భంగా మలిశెట్టి వెంకటరమణ మాట్లాడుతూ వరద బాధితులను జనసేన అన్ని విధాలుగా ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. అన్నమయ్య ప్రాజెక్టు పరీవాహక ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తమ అధినేత పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకుపోయి పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం వరదలో మృతి చెందిన టంగుటూరు పెంచయ్య కుమార్తె పుత్తూరు బుజ్జమ్మకు రూ.ఐదు వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు భాస్కర్ పంతులు, పోలిశెట్టి శ్రీనివాసులు, గోపి, చౌడయ్య, జనసేన వీర మహిళలు జడ్డా శిరీష, మాధవి పాల్గొన్నారు.

క్రైం కార్నర్

పందుల దాడిలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి-సుండుపల్లి

మండలంలోని రాచమాండ్లపల్లె అడవి మార్గంలో పందులు స్కూటర్‌ను ఢీకొట్టడంతో దేవా రెడ్డి అనే వ్యక్తికి గాయాలయ్యాయి. వివరాలు దేవారెడ్డి తనసొంత పనిపై ద్విచక్రవాహనంలో రాయచోటికి బయలుదేరాడు. అడవి మార్గంలోకి వెళ్తున్న సమయంలో పందులు ఒక్కసారిగా గుంపులుగా ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టాయి. ఈ సంఘటనలో అతను కిందపడి గాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి అతన్ని అంబులెన్స్‌లో రాయచోటి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యులు సూచన మేరకు తిరుపతికి తీసుకెళ్లారు. గతంలో చాలా మంది ఈ మార్గంలో పందులధాటికి గాయపడిన సంఘటనలు అనేకం ఉన్నాయి.

చికిత్స పొందుతూ మహిళ మృతి

రామాపురం: కర్నూలు - చిత్తూరు 40వ జాతీయ రహదారిలోని రామాపురం మండలం కొత్త రోడ్డు నారాయణపురం సమీపంలో ఈనెల 3న రోడ్డు ప్రమాదంలో గువ్వలచెరువుకు చెందిన సయ్యద్ మహబూబ్ జాన్ (47) మహిళ తీవ్ర గాయాలు కాగా చికిత్స కోసం తిరుపతి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం మృతిచెందారు. ఎస్ఐ కొండారెడ్డి కేసు నమోదు చేశారు.